ఆలయ భూమిలోని మట్టిపై కన్ను

- భూమి చదును పేరుతో మట్టి తవ్వకం
- అక్రమంగా తరలించేందుకు యత్నం
- ఈవో ఆదేశాలు బేఖాతర్
- ఉన్నతాధికారులు ఆదేశాలతో తవ్వకాల నిలిపివేత



పాలమూరుపాడులో మట్టిని తవ్వేందుకు వినియోగించిన జేసీబీ

తాళ్లరేవు: ఆలయానికి చెందిన భూములపై పలువురు అక్రమార్కుల కన్ను పడింది. మండల కేంద్రమైన తాళ్లరేవు కేశవపురంలో వేంచేసియున్న శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామి ఆలయానికి చెందిన భూముల్లోని మట్టిని అక్రమంగా తవ్వి, తరలించేందుకు కొందరు యత్నించారు. దేవుని భూముల్లో సైతం ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా మట్టిని స్వాహా చేసేందుకు సర్వం సిద్ధం చేసారు. పలువురు దేవస్థాన ఈవో యర్రా వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేయడంతో అక్కడి నుంచి వారు పలాయనం చిత్తగించారు.

టీకి డ్రెయిన్‌లో డ్రెడ్జింగ్‌తో పొలాల్లో మట్టి దిబ్బలు

వివరాల్లోకి వెళితే కేశవస్వామి వారికి కాజులూరు మండలం కోలంక పంచాయతీ పరిధిలోని పాలమూరిపాడులో సుమారు వంద ఎకరాలకుపైగా వ్యవసాయ భూమి ఉంది. ఈ భూములను అనేక మంది రైతులు కౌలుకి సాగు చేసుకుంటున్నారు. టీకి డ్రెయిన్‌కు చెంతన ఉన్న ఎకరం భూమిని గ్రామానికి చెందిన పి.కిషోర్ అనే రైతు కౌలుకు తీసుకున్నాడు. ఆ భూమిలో గతంలో టీకి డ్రెయిన్‌లో డ్రెడ్జింగ్ చేయగా వచ్చిన మట్టిని ఆ



మట్టిని తరలించేందుకు సిద్ధం చేసిన ట్రాక్టర్లు



దేవుని భూమిలో తవ్వేసిన మట్టి

ప్రాంతంలో వేయడంతో పలు చోట్ల మట్టి దిబ్బలు ఏర్పడ్డాయి. ఆ మట్టి దిబ్బలను తవ్వి తరలింపునకు అధికారులు వేలం నిర్వహించారు. పాటదారుడు చాలావరకు మట్టిని తరలించి కొంతమేర అలాగే వదిలివేసారు.

సాగుకు భూమి అనుకూలంగా లేదని కౌలురైతు ఫిర్యాదు

మట్టి దిబ్బలతో ఉన్న ఆ భూమి సాగు చేసేందుకు అనుకూలంగా లేదని, చదును చేయాలని రైతు కిషోర్ అధికారుల వద్ద మొరపెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ తరువాత మట్టిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఈఓ చెప్పారు. ఆయన మాటలను ఖాతరు చేయకుండా కిందిస్థాయి ఉద్యోగి జోక్యంతో అక్రమార్కులు రంగంలోకి దిగి మట్టిని తరలించేందుకు జేసీబీ, ట్రాక్టర్లను ఏర్పాటు చేసారు. దీనిపై పలువురు దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈవో పనులను నిలిపివేసి ఆ ఉద్యోగికి షోకాజ్ నోటీసు జారీ చేసారు.

మట్టిని తొలగించేందుకు గతంలో వేలం

మట్టి తరలింపు ఘటనపై దేవస్థాన ఈవో యర్రా వెంకటేశ్వరరావును వివరణ కోరగా ఆ భూమిలో ఉన్న మట్టిని తొలగించేందుకు గతంలో వేలం పాట నిర్వహించామన్నారు. సుమారు రూ.3.30 లక్షలకు పాట దక్కించుకున్న కాంట్రాక్టర్ చాలా వరకు మట్టిని తీసుకువెళ్లిపోయాడని, అక్కడక్కడ కొంతమేర ఇంకా మట్టి దిబ్బలున్నాయని తెలిపారు. వాటిని త్వరలో తొలగించి చదును చేసి సాగుకు అనుకూలంగా భూమి అప్పగిస్తామని చెప్పినప్పటికీ ఇంతలో కొంతమంది మట్టి అక్రమ తరలింపునకు యత్నించారని ఈవో అన్నారు. ఈ ఘటనపై సంబంధిత ఉద్యోగితోపాటు మట్టి అక్రమ తరలింపునకు యత్నించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

డంపింగ్ యార్డు స్థల సేకరణకు చర్యలు



డంపింగ్ యార్డ్ సమస్యపై అధికారులతో చర్చిస్తున్న యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్

యానాం: యానాంలో నెలరోజులుగా యానాం పారిశుధ్య పనులు చేపట్టినప్పటికీ సేకరించిన చెత్తను ఎక్కడ డంప్ చేయాలన్న అయోమయంలో అధికారులున్నారు. పదిరోజుల క్రితం గోపాల్‌నగర్ పవర్ గ్రిడ్ దగ్గర పరిపాలనాధికారి పోలీస్ బందోబస్తుతో చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. చెత్త డంప్ చేయడాన్ని స్థానికులు అడ్డుకుని ధర్నా చేపట్టారు. గోపాల్‌నగర్ గ్రామ ప్రజలకు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ ఈ నెల 1న మంగళవారం ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ గ్రిడ్ వద్ద ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్ యార్డు వచ్చే అవకాశం లేదని, ఈ సమస్య కోర్టులో ఉన్న విషయం కొంతమందికి తెలుసని, కావాలనే తనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే అశోక్ తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం పరిపాలనాధికారి మునిస్వామి, ఇన్‌చార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణతో సమావేశమై యానాంలోని ప్రభుత్వ భూములను గుర్తించామన్నారు. త్వరితగతిన భూ సేకరణకు చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

62 ఏళ్ల వయో పరిమితిని వర్తింపజేయాలి

అమలాపురం టౌన్: మున్సిపాలిటీల్లో పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు వర్తింపజేసిన విధంగానే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పనిచేస్తున్న కార్మికులకు 62 ఏళ్ల వయో పరిమితిని అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల బాబి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు బుధవారం ఒక వినతిపత్రాన్ని అందజేశారు. అమలాపురం మున్సిపాలిటీలో 60 ఏళ్లు నిండిన ముగ్గురు పారిశుధ్య కార్మికులను తొలగించాలన్న సర్క్యులర్‌పై బాబి స్పందించి ఈ వినతిపత్రం అందించారు. బాబితో పాటు జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా యూనియన్ సభ్యులు ఆర్.పవన్, పి.దావీదు, ఎ.ఆదినారాయణ, పి.రాజేష్, నాగరాజు, ఎం.చిన్న తదితరులు ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం అందజేశారు.

నరసింహమూర్తి సేవలు అభినందనీయం

ఉప్పలగుప్తం: ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ముత్యాల నరసింహమూర్తి సేవలు అభినందనీయమని పలువురు వ్యాఖ్యానించారు. మండలంలోని భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ ముత్యాల నరసింహమూర్తి బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి దంపతులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు దేశంశెట్టి నాగరత్నకుమారి, నాగులపల్లి శేషవేణి, ఎస్ఎంసీ చైర్మన్ గుర్లింక సూర్యనారాయణమూర్తి, హెచ్ఎం నూకల సత్యనారాయణ, ఎంఈవో–2 సత్తి సత్యకృష్ణ, కామన మధు, ఆర్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల రుణాల కోసం నేడు ఇంటర్వ్యూలు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ పరిధిలో బీసీ, కాపు, తెలగ, బలిజ, ఒంటరి కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడం కోసం మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. బీసీ సంక్షేమ పథకం ద్వారా వివిధ వర్గాలకు పలు యూనిట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని 15 వార్డు సచివాలయాల ద్వారా గత నెల 25వ తేదీ వరకూ వచ్చిన దరఖాస్తులకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం స్క్రీనింగ్, సెలెక్షన్, కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రాజు తెలిపారు.


అసంఘటిత రంగ కార్మికులను ఆదుకోవాలి



విద్యుత్ శాఖ సిబ్బందిని సన్మానిస్తున్న యూనియన్ సభ్యులు

ఉప్పలగుప్తం: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం రాయితీలు అందించి ఆదుకోవాలని శ్రీభీమేశ్వర లైటింగ్, సౌండ్ సిస్టం, టెంట్ హౌస్, జనరేటర్ ఓనర్స్ యూనియన్ కోరింది. మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రులో అసోసియేషన్ మండల అధ్యక్షుడు చప్పిడి దుర్గారావు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్తు శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్లు వంగా లవకుమారుడు, లైన్‌మెన్ భారతీ వెంకటేశ్వరరావు, జేఎల్ఎం విజయ్‌ను యూనియన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు చప్పిడి దుర్గారావు, కార్యదర్శి కుంపట్ల సురేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి శ్రీకారం



పెంకేపేటలోని శ్మశాన వాటికను పరిశీలిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు పెంకేవారిపేటలో అస్తవ్యస్తంగా ఉన్న శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు పార్టీలకతీతంగా నాయకులందరితో చర్చించి తాళ్లరేవు లయన్స్‌క్లబ్ కార్యాచరణ చేపట్టింది. గురువారం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు బుధవారం అన్నిపార్టీల నాయకులు, గ్రామపెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా జంగిల్ క్లియరెన్స్, గ్రావెల్‌తో మెరక పనులు, శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణం, దహన సంస్కారాలకు రెండు బెడ్‌ల ఏర్పాటు, శివుని విగ్రహం ఏర్పాటు, గార్డెనింగ్ తదితర పనులు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పొన్నాడ పేరయ్యరాజు, బి.శ్రీనివాసరెడ్డి, గాదిరాజు సతీష్‌రాజు, నాయకులు నడింపల్లి వినోద్, బొంతు మోహన్, గంజా సూరిబాబు, రోళ్ల చక్రవర్తి పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు పొలమూరి బాలకృష్ణ



సాకుర్రులో బాలకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, దళిత నాయకులు

అమలాపురం రూరల్: అమలాపురం మండలం సాకుర్రులో దళితరత్న, ఆర్‌పీఐ మాజీ జాతీయ మాజీ కార్యదర్శి, మాజీ సర్పంచ్ పొలమూరి బాలకృష్ణ 83వ జయంత్యుత్సవాన్ని ముత్తాబత్తుల రమణ అధ్యక్షతన ఘనంగా బుధవారం నిర్వహించారు. బాలకృష్ణ చిత్రపటానికి దళిత నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉత్తమ ఆదర్శ సర్పంచ్ అవార్డును, ఆంధ్రప్రదేశ్, కేరళ గవర్నర్ల చేతుల మీదుగా దళితరత్న, సేవా ప్రపూర్ణ అవార్డులు పొందిన ఏకైక నాయకుడు బాలకృష్ణ ఆదర్శనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొలమూరి నీనా పద్మజ ధర్మపాల్, సర్పంచ్‌లు పెదిరెడ్డి రాము గుత్తుల చిరంజీవి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పొలమూరి బాలకృష్ణ, పొలమూరి రమేష్, మాజీ సర్పంచ్‌లు ఆయన సేవలు కొనియాడారు. అమలాపురంలో బాలకృష్ణ జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా దళిత జేఏసీ చైర్మన్ డీబీ లోక్ పాల్గొని బాలకృష్ణ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబురావు, ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్ బాబు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

- 7న స్వామి కల్యాణం, 8న రథోత్సవం, తీర్థం
- ఉత్సవ కమిటీ చైర్మన్ అబ్బాయి వెంకన్న

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 4 నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించేందుకు దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. ఈ క్రమంలో దేవస్థానంలో ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలు వివరించారు.

ప్రతి భక్తుడికీ స్వామి తలంబ్రాలు అందజేత

స్వామి కల్యాణం రోజున తలంబ్రాల కోసం భక్తులు ఆసక్తిచూపడం, చివరకు అందరికీ దక్కకపోవడం వంటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ సారి ప్రతి భక్తుడికి స్వామివారి కల్యాణ తలంబ్రాలు అం



కల్యాణోత్సవాల ఏర్పాట్లను వివరిస్తున్న ఈవో వెంకటేశ్వరరావు, కమిటీ చైర్మన్ అబ్బాయి వెంకన్న

దే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ అబ్బాయి వెంకన్న స్పష్టం చేశారు. 7వ తేదీ ఉదయం 8.58 గంటలకు నిర్వహించనున్న స్వామి కల్యాణంలో కల్యాణ దాతలు గతంలో తలంబ్రాల కోసం రెండు కిలోల మంచి ముత్యాలు అందించగా వారు ఈ కల్యాణోత్సవాలకు 3 కిలోల మంచి ముత్యాలు అందించేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. తలంబ్రాల బియ్యంలో మంచి ముత్యాల కలిపి భక్తులందరికీ పంచే ఏర్పాట్లు పక్కా చేపడతామని తెలిపారు. 8వ తేదీ ఉదయం నుంచి రాత్రి వరకూ దేవస్థానం ఆవరణలో స్వామి వారి తీర్థం వైభవంగా జరుగుతుందని ఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. సాయంత్రం 3.15 గంటలకు స్వామి వారి రథోత్సవం సాగుతుందన్నారు. రథంతోపాటు గారడీ బృందాలు, కేరళ వాయిద్యాలు తదితర సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు కొనసాగుతుందని వివరించారు. దేవస్థానం ప్రాంగణంలో చలువ పందిళ్లను ఇప్పటికే నిర్మించారు. విద్యుత్ దీపాల అలంకరణ పూర్తయ్యింది. తెప్పోత్సవం, పుష్పోత్సవం, ఉయ్యాల సేవోత్సవం, పలు వాహన గ్రామోత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు కొమ్ముల ఆదిబాబు, గోకరకొండ లక్ష్మణరావు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు విజయకుమారికి ఘన సత్కారం

అల్లవరం: గోడిలంక ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ చేసిన మోసుగంటి విజయకుమారిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు నూర్జహాన్ బేగం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సన్మాత గ్రహీత విజయకుమారి సేవలను పలువురు కొనియాడారు. సన్మాన గ్రహీత విజయకుమారి, వెంకటేశ్వరరావు దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ రుద్రరాజు పవిత్ర, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.దొరబాబు, ప్రధాన కార్యదర్శి సత్యపల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ సభ్యుడు శివప్రసాదు, ఎంఈఓ కిరణ్‌బాబు, ఎస్.ఏడుకొండలు పాఠశాల స్థలదాతలు రుద్రరాజు రవికుమార్, రుద్రరాజు రమేష్‌రాజు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ఉప్పలగుప్తం: విలసవిల్లిలో ఆక్రమణకు గురవుతున్న అంగన్‌వాడీ స్థలాన్ని పరిరక్షించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త కె.అరుణ అధికారులను వేడుకున్నారు. విలసవిల్లిలో సర్వే నం 172/3లో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మానంతో గతంలో కేటాయించిన 5 సెంట్ల భూమిలో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పాక వేసి ఆక్రమించుకుంటున్నాడంటూ పంచాయతీ కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావుకు బుధవారం స్థానికులు వినతిపత్రాన్ని అందజేశారు. ఆ భూమిని స్వాధీనం చేసుకుని అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టాలని వారు కోరారు.



విలసవిల్లిలో ఆక్రమణకు గురవుతున్న అంగన్‌వాడీ స్థలాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

ఏప్రిల్ 13న గురుకులం ప్రవేశ పరీక్ష

అల్లవరం: గురుకులాల్లో ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 6న నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్ష అనివార్య కారణాలతో ఏప్రిల్ 13న వాయిదా పడిందని ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 13న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదవ తరగతికి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ వారికి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు.

20 లీటర్ల సారాతో మహిళ అరెస్ట్

కొత్తపేట: ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన కోట సత్తెమ్మ అనే మహిళను 20 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో విస్తృతంగా నిర్వహించిన దాడుల్లో భాగంగా పేరవరంలో ఈ మహిళను సారాతో అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. నిందితురాలిని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

డైనింగ్ హోల్ ప్రారంభం

అయినవిల్లి: విలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి కొప్పిశెట్టి రామకృష్ణ నిర్మించిన డైనింగ్‌హాల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా బుధవారం ప్రారంభించారు. అలాగే ఎన్ఎంఎస్ స్కాలర్‌షిప్ తీసుకున్న ఏడుగురు విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు పీవీ రవిప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ అమలకట్ల చక్రవర్తి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై నిరసన

మండల సమావేశం నుంచి ప్రజాప్రతినిధుల వాకౌట్



వర్గీకరణపై ఎంపీడీవో బాబ్జీరాజుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్సీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును కూటమి ప్రభుత్వం ఆమోదించినందుకు నిరసనగా బుధవారం అమలాపురం మండల పరిషత్ సమావేశం నుంచి ఎస్సీ వర్గానికి చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు వాకౌట్ చేశారు. ఈ నిరసనకు మిగిలిన ప్రజాప్రతినిధులు కూడా సహకరించడంతో మండల సమావేశం మధ్యలో నిలిచిపోయింది. ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎస్సీ వర్గానికి చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా వర్గీకరణ బిల్లును ఆమోదించిందని నిరసన తెలిపారు. వైస్ ఎంపీపీ బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు రేవు శీనుబాబు, అభ్యంతరం తెలిపి నిరసన వ్యక్తం చేసారు. అనంతరం ఎంపీడీవో ఉండ్రు బాబ్జీరాజు వినతిపత్రం అందించి వాకట్ చేశారు. కూటమి ప్రభుత్వం తప్పుడు లెక్కలతో అన్యాయంగా ఎస్సీ వర్గీకరణ చేసిందన్నారు. సమావేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు.

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధం

ఈ సందర్భంగా జెడ్పీటీసీ పందిరిశ్రీ హరిరామ్‌గోపాల్, రేవు శ్రీనుబాబు, పోలమూరి బాలకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధం కాని ఎస్సీ వర్గీకరణ విషయంలో విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతల లెక్కలు తేల్చకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రభుత్వం హడావుడిగా వర్గీకరిస్తే మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అసెంబ్లీలో ఏకపక్ష తీర్మానం చేయడమే కాకుండా హడావిడిగా ఆర్డినెన్స్ తీసుకురావడం దారుణమని పేర్కొన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు పెనుమాల సునీత, పందిరి విజయ, నక్కా రాజరత్నం నాగవాణి, తిరుకోటి సూజాత, నక్కా అరుణకుమారి, ఎంపీటీసీలు ఊడుం రామకృష్ణ, పరమట నాగమణి, గుత్తుల ఆనిత, కోఆప్షన్ సభ్యుడు మోసలి సర్జన్‌రాజు, వాకట్ చేసి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించారు.

ఈహౌసింగ్ బిల్లులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం


అర్హులైన ప్రతి ఒక్కరికీ హౌసింగ్ రుణాలు అందివాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఈ విషయాన్ని మరచి హౌసింగ్ రుణాలపై రాజకీయ రంగు పులుముకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదంటూ మండల హౌసింగ్ ఏఈ వినాయక వర్మపై ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలోని ప్రజాప్రతినిధులు ఏఈ తీరుపై సభ్యులు మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రుణాల కోసం దరఖాస్తులు అందిస్తే ఎందుకు తీసుకోవడం లేదని ఏఈ తీరుపై పలువురు ప్రశ్నించారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ మాట్లాడుతూ హౌసింగ్ రుణాల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. కంభంపాడు రోడ్డు దుస్థితి, సచివాలయాలు, అసంపూర్తిగా నిర్మించిన విలేజ్ క్లినిక్ భవనాల అంశాలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో వైస్ఎంపీపీ అడపా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

సఖినేటిపల్లి: అప్పనరామునిలంక శివారు కొత్తలంకలో స్థానిక జైభీమ్ ఆదర్శ యువజన సంఘం గురువారం నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం టోర్నమెంట్ నిర్వాహకులు వివరాలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో తొమ్మిదో వార్షికోత్సవం పురస్కరించుకుని గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రోత్సాహానికి ఈ చర్యలు చేపట్టామన్నారు. కాగా టోర్నమెంట్‌ను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ప్రారంభించనున్నట్టు, పలువురు ప్రముఖులు పాల్గొంటారని నిర్వాహకులు చెప్పారు.

ఉత్తమ సేవలకు ఎల్లవేళలా గుర్తింపు

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా పాఠశాల అభివృద్ధికి ఉత్తమ సేవలందించే వారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని జిల్లా సీఎంఓ బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విత్తనాల ఇంద్రశేఖర్ అన్నారు. గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన బళ్ల శ్రీనివాస్ సన్మాన సభ హెచ్ఎం జి.రాజశేఖర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. వారు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి వారి భవిష్యత్‌కు శ్రీనివాస్ బంగారు బాటలు వేశారన్నారు. పాఠశాలకు రూ.10 వేలు విలువైన కంప్యూటర్ సామగ్రిని శ్రీనివాస్ బహూకరించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ తొత్తరమూడి గోవిందు, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.



శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

పండితుడికి ప్రశంసాపత్రం

ఆలమూరు: గ్రామంలో వేంచేసియున్న అతి ప్రాచీన విక్రమ భట్టేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, ప్రముఖ శైవాగమ వేద పండితుడు కాళ్లకూరి సూరిపండుకు ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలోని వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ప్రశంసాపత్రాన్ని అందజేసింది. తిరుపతిలోని వేదిక్ యూనివర్సిటీ ద్వారా గత 21 రోజులుగా ఆన్‌లైన్ విధానంలో శైవాగమ, వైఖానస, పాంచరాత్ర ఆగమశాస్త్ర విభాగాల్లో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించారు. ఈ క్లాసుల్లో పాల్గొన్న వారికి ఇటీవల వార్షిక పరీక్షలు నిర్వహించగా అందులో కాళ్లకూరి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. దీంతో తిరుపతిలోని వేదిక్ యూనివర్సిటీ ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 'ఇంటర్నేషనల్ ప్రశంసా పత్రంతో పాటు వేద పండిత గుర్తింపు పత్రాన్ని కూడా ఆయన స్వీకరించారు. శైవాగమ గుర్తింపుపత్రం స్వీకరించిన కాళ్ళకూరి సూరిపండుని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు, మహిళా భజన మండలి సభ్యులు అభినందించారు.



ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న వేద పండితుడు కాళ్లకూరి

అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఎన్నిక

అమలాపురం రూరల్: ఈదరపల్లిలోని అయ్యప్ప స్వామి ఆలయానికి నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బండారు గంగాధరం, కార్యదర్శిగా అడపా శివరామప్రసాద్, శాశ్వత కోశాధికారిగా నల్లా చిట్టిబాబు సలహాదారులుగా, నందేపు రామాంజనేయులు, దొమ్మేటి సాయిబాబా, తూము నాయుడు, కమిటీ సభ్యులుగా మోరం సాంబశివరావు, చాగంటి ప్రసాద్, కడలి సత్యనారాయణ, నడింపల్లి సత్యనారాయణ రాజు, స్వామి ఆలపాటి నారాయణ, అడపా సత్తిబాబు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడు, శాశ్వత ముఖ్య సలహాదారులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

సమగ్ర విచారణ జరిపించాలి

ఆలమూరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరపడంతో పాటు క్రైస్తవులపై దాడులు అరికట్టాలని మండలం పాస్టర్ ఆఫ్ ఫెలోషిప్ డిమాండ్ చేసింది. మత ప్రబోధకుల ఆధ్వర్యంలో క్రైస్తవులందరూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నో అనుమానాలను కలిగిస్తున్న పాస్టర్ ప్రవీణ్ మృతిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించడం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రవీణ్ పగడాల మృతిపై అన్ని విధాలుగా సమగ్ర విచారణ చేసి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న అనేక దాడులను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పాస్టర్ మృతిపై విచారణ జరపాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు